
# ఒక ఆత్మకథ

- యన్. కె. రామారావు



నేను మా సొంతూరు వదిలి పన్నెండేళ్ళయింది. ఇన్నేళ్ళూ దుబాయిలో వుద్యోగించి ఈ రోజే మావూళ్ళో కాలుపెట్టాను. మా వూరు పట్నం దశ వదిలి నగరం దశ అందుకోలేక త్రిశంకుళ్ళా మధ్యలో వేళ్లాడుతోంది. కొత్త కాలేజీలు, స్కూళ్ళు, సినిమా హాళ్ళు, పోలీసు స్టేషన్లు, కోర్టులు, వాహనాలు, మ్యూజిక్ సెంటర్లు, సైబర్‌కేఫ్‌లు ఊరి మొదలు నుంచి బస్టాండ్ దాకా దారి పొడుగూతా కనిపించాయి. రిక్షాలు కనిపించలేదు. కానీ ఆటోలు మటుకు పుష్కలంగా కనిపించాయి.

నేను బస్సు దిగి సూట్‌కేస్‌తో ఆటోస్టాండు దగ్గరికి వెళ్ళాను. నన్నో కొత్త జంతువును చూస్తున్నట్లు వినోదంగా ఒకడు చేయిపట్టి లాగుతుంటే ఒకడు సూట్‌కేస్ లాక్కుంటూ తన

ఆటోలో ఎక్కమంటే తన ఆటోలో ఎక్కమని బలవంతపెడ్తున్నారు. ఉక్కిరిబిక్కిరయ్యాను. చిన్నప్పుడు కుక్కతోకలు, గాడిద తోకలు లాగి ఏడ్పించిన పాపం ఇలా తీరుతుందేమోనని అనుమాన పడ్డాను. చివరకు మా కాలనీ పేరు చెప్పి ఎంతివ్వాలని అడిగాను. నలభై రూపాయలన్నాడు. వాడి పేరు ఆనందట. నన్ను మాట్లాడనీకుండా దాదాపు అమాంతం ఎత్తుకెళ్ళి ఆటోలో కూలేశాడు. ఆటో స్టార్టయ్యి కదిలిందో లేదో ఎవడో పరుగెత్తుకొచ్చి డ్రైవర్ ఆనంద్ ప్రక్కన కూలబడ్డాడు. అన్నా తమ్మీ వరుసల్తో వాళ్ళేదో మాట్లాడుకుంటున్నారు. సినిమా తారల గురించి, కాలేజీల కెళ్ళే ఆడ పిల్లల గురించి అసభ్యంగా కూస్తున్నారు. నాకు రక్తం ఉడికి పోయినా, ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాను. ఆఖరుకు వాళ్ళ సంభాషణ క్రికెట్ మీదకు వెళ్ళింది. "కొంచెం తొందరగా పోవాలి స్పీడ్ పెంచరాదూ" అన్నాను. "ఇంటికి పోయి ఏం చేస్తావు. టీవీలో పిల్లల ప్రోగ్రాం చూస్తావా" అని ఎత్తిపొడిచాడు. వీడు పొగరుమోతని సరిపెట్టుకున్నాను. ఇదిగో మీ కాలనీ దిగమన్నాడు. కాలనీ చాలా పెరిగిపోయింది. లేన్లు, బైలేన్లు చాలా వెలిశాయి. ఇల్లు గుర్తు పట్టలేను. ఆటో ఆనంద్ సహాయం చేయడం షైలాక్ వడ్డీ లేకుండా అప్పు ఇవ్వడం సమానమే అనిపించింది. దాంతో వాడ్ని అడగకుండా దిగిపోయాను. వందరూపాయల నోటిస్తే చిల్లరలేదని నోట్‌తో సహా వెళ్ళిపోవడానికి సమాయత్తమయ్యాడు. నేనడ్డగించాను. ఇద్దరి మధ్య పోట్లాట మొదలైంది. నేను వాడి కాలర్ పట్టుకున్నాను. తమ్మిగాడు నన్ను వాడి వైపు తిప్పుకున్నాడు. ఆనంద్ నా వెనుకనుంచి వీపులో కత్తి దింపేశాడు. "అమ్మా" అని అరిచాను. కిటికీల్లోంచి చూస్తున్న ఇరుగుపొరుగువారు కిటికీ తలుపులు మూసేసి టీ.వి సీరియల్లో మునిగిపోయారు. ''అమ్మా వీడు మళ్ళీ బ్రతికాడే"నని ఆశ్చర్యంతో వేసిన కేక పక్కింటి నుంచి వినబడింది. టి.వీ.సీరియల్‌లో ఇంతకు ముందు చచ్చిన పాత్ర మళ్ళీ బ్రతికినట్లుంది. నేను వీపులో కత్తితో, చేతిలో సూట్‌కేసుతో మళ్ళీ రోడ్డెక్కాను. ఆ వైపు నుంచి ఒక ఆర్.టి.సి బస్సు వస్తూ కనిపించింది. ఇక చెయ్యి ఎత్తాను. బస్సులోకెక్కి చూస్తే ఎక్కువ జనంలేరు. కండక్టరుకు బస్టాండు అని చెప్పి రెండు రూపాయలిచ్చాను. కూర్చోండి సార్ ఈ మాత్రం దానికి టిక్కెట్టు ఎందుకన్నాడు. అందరూ నా వైపూ, కత్తివైపూ విచిత్రంగా చూసి మళ్ళీ వాళ్ళ వాళ్ళ ముచ్చట్లలో మునిగిపోయారు.

ప్రభుత్వం ఆసుపత్రి కనుక్కొని లోపలికెళ్ళాను. వీపులో కత్తి, చేతిలో సూట్‌కేసు నిటారుగా నడుస్తూ క్యాజువాలిటీ డాక్టర్ దగ్గరకెళ్ళాను. అతను ఏదో ఇంగ్లీషు పత్రిక చదువుతున్నాడు. నన్ను చూసి చిరాకుగా ఏమైంది అని అడిగాడు. నేను నా చేయి వీపు వైపు చూపించాను. లేచి నా వీపు దగ్గరకు వచ్చి కత్తిని చూసి చాలా సంబరపడ్డాడు. కత్తి దిగిన ప్రాంతాన్ని చూసి నెత్తురెక్కువ కారకుండా అలా నిటారుగా కత్తిని దింపిన కళాకారుడి ప్రజ్ఞను, నైపుణ్యాన్ని వేనోళ్ళ కొనియాడుతున్నానన్నాడు. తానే కాదట. ఆ మాట కొస్తే వాళ్ళ ఆసుపత్రి డాక్టర్లందరూ ఈ మాట ఒప్పేసుకుంటారట. నేను దుఃఖంతో కత్తి కళాకారుడి పేరు చెప్పి ఈ కత్తిని లాగేసి నన్ను యథా పూర్వస్థితికి తెస్తే అతని కడుపున పుడతానని వాగ్దానం చేశాను. అతను వాగ్దానాలు నమ్మేవాడు కానట్లుంది. ససేమిరా వైద్యం చేయనన్నాడు. నేను పోలీసు రిపోర్టు ఇచ్చి వాళ్ల ద్వారా రావాలట. నా వీపులో దిగింది కత్తే కానీ, వేయి రూపాయల నోటు కాదని చెప్పి నా కళ్ళు తెరిపించాడు. అయినా నేనివ్వదలుచుకోక వీపులో కత్తితో, చేత్తో సూట్‌కేస్‌తో అలా నడుస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను.

సెంట్రీ ఇక నిశ్చల సమాధిలో యోగముద్రలో వున్న మునిలా కనిపించాడు. నేను లోనికి వెళ్తున్నా ఏమీ అడ్డుకోలేదు. స్టేషన్ అధికారి లేడు. జానయ్య అనే హెడ్ నన్ను చూసి వివరం కనుక్కొని కత్తిని చూసి భలే ముచ్చటపడ్డాడు. పక్క రూములోని కానిస్టేబుల్‌ను పిలిచి కోర్టులో దాఖలు చేయాల్సిన కత్తిపోయింది కదా నా వీపులో వున్నది పీకి దాని స్థానంలో పెడదామని ప్రతిపాదించాడు. వాళ్ళిద్దరి

మధ్య ఈ విషయమై గుసగుసలతో కూడిన సంప్రదింపులు మొదలయినాయి. నేను రెండు చేతులు ఎత్తి దండం పెట్టాను. "నాయనలారా! ఆ పని డాక్టరు చేత చేయించండి. తరువాత కత్తిని మీరే రకంగా వాడుకున్నా నా కభ్యంతరం లేదు. కోర్టులో పెట్టినా, మ్యూజియంలో పెట్టినా నేను మీ జోలికి వస్తే మీ ఎడం కాలి బూటుతో తన్నండని" వేడుకొన్నాను. జానయ్య నా మొరాలకించి కత్తిని పీకే ఉద్దేశ్యం విరమించుకున్నాడు. కానీ రిపోర్టు రాయనన్నాడు. నా స్టేట్‌మెంట్ రికార్డు చేసుకొని దాన్నే రిపోర్టుగా భావించి నన్ను ఆస్పత్రికి పంపమని ప్రాధేయపడ్డాను. అయినా అతను తన పట్టుదల వదల్లేదు. ఆఫీసర్లు లేనప్పుడు కేసు రిజిష్టరు చేస్తే వాళ్ళూరుకోరట. ఏమైనా కతికాడేమోనని అనుమానిస్తారట. అంచేత ఉత్తినే మాటలు పడడం ఎందుకు ఒక వెయ్యి రూపాయలిస్తే పని చేస్తానన్నాడు.తాను మంచివాడట, కానీ వాడి పైవాడు కక్కుర్తి వెధవట. నేను ససేమిరా అని రోద్దెక్కాను. నాకు కోపం ఆగట్లేదు. దుబాయ్ నుంచి ప్రతినెలా మా వాళ్ళకు డబ్బు పంపిస్తున్నాను. ప్రస్తుతం ఎంతో కొంత బంగారం తప్ప సూట్‌కేస్‌లో చెప్పుకోదగ్గంత నగదు లేదు. జానయ్య చెప్పాడు డాక్టరు పేరు దివాకరట. అతనికి వేరే ఇచ్చుకోవాలట. నాకు కడుపులోనూ, వీపులోనూ మండింది. రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వం నియమించిన ఈ అధికార్లు వాళ్ళ పని వాళ్లెందుకు చేయరు. నేను కానీ, నాలాంటి వాళ్ళు కానీ ఎందుకు డబ్బివ్వాలి.

స్టేషన్ బయటకు వచ్చిన తర్వాత నాకు ఆటో ఆనంద్ మీద కోపం పెరిగింది. ఇంత అనర్ధానికి వాడే మూలం. వాడి మీద పగ తీర్చుకోవాలి. పోలీసు సహకరించదు. అర్జంటుగా వాడి మీద పగ తీర్చుకోవాలి. ఎవరైనా దాదా దగ్గరకు వెళితే? ఆలోచన వచ్చిందే తడవుగా రోడ్డు మీద పోతున్న వాణ్ణొకణ్ణి ఆపి ఈ వూళ్ళో దాదాలున్నారా అనడిగాను. ఈ వూళ్ళో వున్నదే దాదాలని, వూరు దాదాపు దాదాలమయం అయిందని అతను కన్నీళ్ళు పెట్టుకున్నాడు. బాధపడకని అతడి నూరడించి ఒక మంచి దాదాపేరు చెప్పమన్నాను. అతను కన్నీళ్ళు తుడుచుకొని మంచి దాదాలెవరూ లేరని అసలుంటారో లేదో తనకింకా తెలియదనీ, కాకపోతే పేరు మోసిన దాదా కేవలం దాదా సింగనీ, అతని అడ్రసు చెప్పాడు.

చేతిలో సూట్‌కేసుతో, వీపులో కత్తితో నేను దాదా సింగ్ గారి దగ్గరకు వచ్చాను. ఆశ్చర్యం, మా నాన్న రిటైర్డు హెడ్ మాస్టర్ రంగనాథంగారు సింగు సింహాసనానికి ఎదురుగా మోకరిల్లి ప్రణామం అర్పిస్తూ కనపడ్డాడు. నేను క్రీనీడలో వున్నాను. వాళ్ళకు నేను కనపడను. మాటలు సరిగ్గా వినరావటంలేదు. మా నాన్న మటుకు కళ్ళు తుడుచుకొని, నిటారుగా నిలబడి దండం బెట్టి బయటికి పోతూ కనిపించాడు. నోట్లో తువ్వాల కొస కనిపించింది. బహుశా దుఃఖంతో వచ్చే ఎక్కిళ్ళు ఆపుకోవడానికి కావచ్చు. దాదాసింగ్‌కు పరిస్థితి చెప్పి ఆనంద్ మీద కఠిన చర్య తీసుకోవాల్సిందిగా ప్రార్ధించాను. మొత్తం విని పెద్దగా ఆంబోతు రంకె వేసినట్లు పెడబొబ్బ పెట్టాడు. "ఆనందా? ఒరే నీకెన్ని గుండెలురా?" అని అరిచాడు. వాడికి మనిషికి వుండే అవయవాల సంఖ్య గురించి ప్రాథమిక జ్ఞానం కూడా లేదని నాకు జాలేసింది. సానుభూతి కురిపిస్తూ "ఒకటే గుండె, ఒకటే వీపు సార్" అన్నాను. వీపులో కత్తిని తడుముకుంటూ.

"ఆనంద్ నారైటాందురా. వాణ్ణి తన్నాలా? నిన్ను తంతా, ముందు బయటికి పో". వాడి ఆజ్ఞ శిరసావహిస్తూ బయటకి వచ్చాను. ఆకాశంలో చంద్రుడు తన డ్యూటీ తప్పకుండా చేస్తున్నాడు. నక్షత్రాలూ అంతే. చెట్లు గాలి వీస్తున్నాయి. తెల్లారితే సూర్యుడొస్తాడు. వీళ్ళ డ్యూటీలు వీళ్ళు తప్పకుండా చేస్తారు. అలా చూసేసరికి మా నాన్న రంగనాథం గారు కనిపించారు. దగ్గరగా వెళ్ళి నాన్నా అన్నాను. నన్ను ముందు నుంచి చూసి చాలా సంతోషపడ్డాడు. ఇంటి వ్యవహారాలన్నీ చెప్పాడు. నేను పంపిన డబ్బుతో నా కోసం ఒక ఇంటి జాగా కొంటే దాదాసింగ్ కబ్జా చేశాడట. వారం రోజులుగా రోజూ బ్రతిమిలాడినా వాడు వినడం లేదట. ముందు పోలీసులకూ, రెవిన్యూకు

దరఖాస్తు పెట్టినా వారు ఆయన ప్రార్ధన పెడచెవిన పెట్టారట. ఆఖరుకు వీణ్ణి ప్రార్థిద్దామని వారం రోజులుగా రోజూ దేవుని ముందు మోకరిల్లినట్లు, మోకరిల్లినా వినడం లేదట. మంచి వాళ్ళకు ఇవి రోజులు కావట. కన్నీళ్ళు పెట్టుకుంటూ నన్ను కౌగిలించుకోవటానికి సంసిద్ధుడైనాడు. నేను కేక పెట్టాను. "నాన్నా నా వీపులో కత్తుంది. జాగ్రత్త. గట్టిగా కావిలించుకుంటే అది మరీ లోపలికెళ్తే నా ప్రాణవాయువులు అనంత వాయువుల్లో కలిసిపోతాయి. కాకపోతే నా ప్రాణం పరాయిగడ్డ మీద కాకుండా నా జన్మభూమిలో పోయిన తృప్తి నా ఆత్మకు మిగులుతుందనే తృప్తి వుంటుందనుకో. అది వేరే విషయం." కత్తనగానే మా నాన్న మూడు గజాల దూరానికి లాంగ్‌జంప్ వేశాడు. ఆయన వంట్లో వణుకు వెన్నెల్లో కనిపిస్తూనే వుంది. నేను కళ్ళు మూసుకొని "నాన్నా ఈ సూట్‌కేసులో నా బట్టలతో పాటు కొంత బంగారం వుంది. దీనిని జాగ్రత్తగా ఇంటికి పట్టుకెళ్ళు. మంచి ఆటో చూసుకో." బంగారం అనగానే మా నాన్న కళ్ళల్లో ఆశతో కూడిన మెరుపు మసక వెన్నెల్లో సైతం కనిపించింది. ఈ మాట అని నేను కళ్ళు తెరిచేసరికే మా నాన్న నా కంటికి అందనంత దూరం పరిగెత్తుకు పోయాడు. తాను చిన్నప్పుడు రన్నింగ్‌లో ఫస్టని నాకు ఎప్పుడూ చెప్పిన గుర్తులేదు.

సరే ఇక ఈ పూటకి ఎక్కడో అక్కడ విశ్రాంతి తీసుకొని పొద్దున్నే కత్తి, గాయం సంగతి చూసుకుందామని ఊరిబయట ఒక కాలువ ప్రక్కన వున్న పెద్ద రాతి బండ మీద బోర్లా పడుకున్నాను. ఇలా పడుకున్నా హాయిగానే వుంది. పొద్దుటి నుంచి జరిగిన సంగతులు జ్ఞాపకం చేసుకుంటూ అలాగే నిద్రపోయాను.

పొద్దునే లేచి వీపు తడిమి చూసుకుంటే కత్తిలేదు. విచిత్రంగా గాయం కూడా లేదు. నొప్పి లేదు. ఎవడో దొంగ వెధవ నేను నిద్రలో వున్నప్పుడు కత్తి లాక్కెళ్ళుంటాడు. దగ్గరలో వున్న కాలువ నీళ్ళతో ముఖం కడుక్కుని, కొంచెం స్నానం చేసి, అవే బట్టలు తొడుక్కుని మళ్ళీ బండ మీద కూలబడ్డాను. ఏదో వాసన వచ్చి పక్కకు చూద్దును కదా ఒక భారీ కాయుడు, చదువు సంధ్యా లేని వాడు బీడీ దమ్ము కొడుతూ కూని రాగం తీస్తున్నాడు. వాణ్ణి పలకరిద్దామని "నమస్తే సార్"అన్నాను. వాడు వెంటనే 'సార్ గీర్ అనబాక, మనదంతా మోటు సరుకు. నా పేరు పెరుమాళ్ళు. అలా పిలు' అని అజ్ఞాపించాడు.

"పెరుమాళ్ళు నువ్వేం చేస్తుంటావ్"

"దొంగతనాలు"

"వామ్మో! అట్లాగా సార్. తమ నివాసం?"

"సాధారణంగా జిల్లా జైలేననుకో. వసతి లేనపుడు చిన్నా చితకా జైళ్ళు. అసలు మనకు ఆ వట్టింపేమీ లేదనుకో. ఎలా వున్నా సర్దుకుపోతాం".

"తమరు విడుదలయ్యారా? లేక జైలు కెళ్ళబోతున్నారా? తమ గమ్యస్థానం ఏమిటి స్వామి?"

"ఛ రాతిరే బయటకొచ్చేశా?"

"పారిపోయా?"

"ఛ పారిపోవటమేంటి?"

"మరి విడుదలయ్యారా?"

"ఛ విడుదలయ్యేదేమిటీ? నేనే వచ్చేశా!" బీడి దమ్ములాగుతూ ఆకాశంలోకి చూస్తున్నాడు. నాకేమీ అర్థం కాలేదు. జైలు నుంచి ఎప్పుడంటే అప్పుడు బయటకు వచ్చే సులువుందా? జైలు రూల్స్ సరళీకృతం చేశారేమో? పెరుమాళ్ళు బీడి పారేసి తన ఆత్మకథ కొనసాగించాడు.

"మనం నీతి తప్పని దొంగలం. ఒకింటికి వెళ్తే దొంగతనం మాత్రమే చేస్తాం. ఇంటి వాళ్ళనూ పిల్లా మేకాను చితక బాదడం మనకిష్టముండదు. మాలో కొంతమంది స్త్రీలను రేపులు చేయడం, చంపడం మొదలెట్టారు. మా పనికే అవమానం అనుకో అట్లాంటి పనులు"

నాకు పెరుమాళ్ళంటే చాలా గౌరవభావం కలిగింది. వాడి కాళ్ళకు మొక్కుదామని ప్రయత్నిస్తే అమాంతం కాళ్ళు పైకిలాగేసుకొని నాకా అవకాశం దక్కకుండా చేశాడు. పెరుమాళ్ళుకి నా కథంతా సవిస్తరంగా చెప్పి ఆనంద్, డాక్టర్ దివాకర్, జానయ్య ఇంకా దాదా సింగు మీద కసి తీర్చుకోవాలని వాళ్ళను మర్డర్‌చేసి దేశానికి మేలు

చేయాలని, దానికిగానూ, పెరుమాళ్ళు కొంతకాలం తన నీతి నియమాలు పక్కకుపెట్టి తన దేహబలం ఈ పనుల కోసం సద్వినియోగం చేయవలసిందిగా ప్రార్థించాను. పెరుమాళ్ళు కాసేపు ఆలోచించి

"సర్లే మన్లో మనం సాయం చేసుకోకుంటే ఈ మనుషులు చేత్తారా ఛ.పర్లేదు" అభయం ఇచ్చాడు. ఆ రోజు సాయంత్రం దివాకర్‌ని వూరి శ్మశానం దగ్గరున్న చింతలతోపుకు రమ్మని ఫోన్ చేశాను. అక్కడ పగలే మనుషులలికిడి వుండదు. ఒక పేషెంటు బుల్లెట్ దెబ్బతో వున్నాడనీ, వూళ్లోకి రావడం వీలు పడదని, తానే వచ్చి వైద్యం చేస్తే లక్షరూపాయలు ఇస్తానన్నాను. దివాకరం చేత్తో టెలిఫోన్‌తో సహా ఎగిరిగంతేసి వస్తానన్నాడు. రాత్రి తొమ్మిది గంటలకు నేను ఒక ఆటో దొంగిలించి ఆస్పత్రి ముందున్నాను. దివాకరం వచ్చీ రావడమే పోనీ పోనీ అన్నాడు. ఎక్కడకు అన్నాను ముఖం చాటు చేసుకుంటూ, "శ్మశానానికి 'సారీ' చింతల తోపుకు". వాణ్ణి తీసుకెళ్ళి మూలుగుతున్నట్లు నటిస్తున్న పెరుమాళ్ళను చూపించాను. అతని కాలు పరీక్షించబోతే పెరుమాళ్ళు ఝాడించి పొట్టలో తన్నాడు. దివాకరం ఎగిరి రెండు గజాల అవతల పడి రక్తం కక్కుకున్నాడు. నేను వెళ్ళి ఎదురుగా నిలబడ్డాను. వెంటనే ప్రాణం విడిచాడు.

మర్నాడు రాత్రి తొమ్మిది గంటలకు ఆటో ఆనంద్‌ను కలిసి చింతల తోపుకు పోవాలన్నాను. విచిత్రంగా చూశాడు. నేను గొంతు తగ్గించి, "ఉష్ సాయంత్రం ఒక పిల్లను కిడ్నాప్‌చేసి ఆ తోపులో వేశొచ్చాను. ఇప్పుడెళ్ళి మజాచేయాలి". ఆనంద్ బండి హుషారుగా స్టార్ట్ చేశాడు. తోపులో కెళ్ళిం తర్వాత పెరుమాళ్ళు ఒక చెట్టు చాటున బందీలా వున్నట్లు కనిపించాడు. ఆనంద్‌కు ఆశ ఎక్కువయింది. నా పొట్టలో పిడికిలితో పొడిచాడు. ప్రమాదం ఊహించి ముందే ప్రక్కకు గంతేశాను. పెరుమాళ్ళు దగ్గరకెళ్ళి కాళ్ళ కట్లు విప్పటానికి సంసిద్ధుడౌతూ తలకిందికి వంచాడు. పెరుమాళ్ళు లాగిపెట్టి తన్నాడు. ఆనంద్ తలబద్దలయి వెంటనే చచ్చాడు.

దాదాసింగుకు ఫోన్ చేశాను. చింతలతోపుకు రాత్రి ఒక్కడే వస్తే భూకబ్జా చేయాల్సిన ఒక భూమి వివరాలు చెపుతానన్నాను. ఒక్కడే రావాలని షరతు పెట్టాను. ధర కనీసం 5 కోట్లు వుంటుందని, నాకు కేవలం ఒక పర్సెంటు చాలన్నాను.

దాదాసింగు రాత్రి పదిగంటలకు వచ్చాడు. చేతిలో పిస్తోలు. పెరుమాళ్ళను చూస్తూనే త్వరగా చంపు త్వరగా చంపు అని తొందరపెట్టాను. నర్తనశాలలో భీముడిలా పెరుమాళ్ళు దుస్తులు తీసేసి దాదాసింగు గుండెలమీద తన్నాలని తనకు కోరికగా వుందని స్పష్టం చేశాడు. దాదాసింగు ఢాం ఢాం రివాల్వర్ పేల్చాడు. పెరుమాళ్ళు ఎంతో లాఘవంగా పైకి, క్రిందికి, ప్రక్కలకు జేమ్సు బాండ్‌లా ఎగిరి వంగి ఆరు గుళ్ళూ తప్పించుకొని దాదాసింగ్‌ను బంధించాడు. ఇద్దరం కలిసి వాడి మెడ పిసికి చంపాము. జానయ్యను చంపితే నా కసి చల్లారుతుంది.

జానయ్యకు ఫోను చేశాను. అర్ధరాత్రి చింతల తోపుకు రావాలని, వస్తే నాకు దొరికిన నిధిలో భాగం ఇస్తానని, వాళ్ళ ఆఫీసరుకు చెప్పకూడదని ఒక్కడే రావాలని షరతు పెట్టాను. జానయ్య రానే వచ్చాడు. పోలీసు కదా! టార్చిలైటు వేశాడు. "ఏయి లైటార్పి ఇలారా" అని కేకేశాను తడుముకోకుండా దగ్గరగా వచ్చాడు. ఒడిసి పట్టుకొన్నాను. పెరుమాళ్ళు ఎదురుగా నిలబడి "జానయ్యా" అని పిల్చాడు. గొంతు గుర్తుపట్టి "ఒరే నువ్వట్రా పెరుమాళ్ళూ, ఆ నిధి ఎక్కడ?" పెరుమాళ్ళకు కోపం వచ్చింది. "చూడు నిన్ను అరేయి గిరేయి అనవల్సింది నేను. నన్ను మీరు అనవల్సింది నువ్వు."

"సరే సార్ నిధి ఎక్కడ?"

"ఇంత భూ ప్రపంచంలో ఏదో ఒకచోట వుండక పోద్దా?"

"అదేంమాట పెరుమాళ్ళు గారూ. అది ఎక్కడ...గో చూపిస్తే. చచ్చి మీ కడుపున పుడతా"

"ఛ లాభం లేదు. ఆ మాటే నిజమయితే నేనే ముందు నీ కడుపున పుట్టాల్సివుంటుంది."

"పెరుమాళ్ళుగారూ"

"జానయ్యా! నన్ను అందరూ నీతిగల దొంగ అని పొగడుతుంటే అన్యాయంగా నన్ను ఎన్ని

కేసుల్లో ఇరికించావురా? గుర్తుచేసుకో? వీడు మొన్న వీపులో కత్తితో వస్తే డబ్బులిమ్మంటావా?" తనేదో ఉచ్చులో ఇరుక్కున్నానని జానయ్యకేదో అనుమానం వచ్చింది. వెంటనే పెరుమాళ్ళ కాళ్ళమీద పడబోయాడు. పెరుమాళ్ళు వెనక్కి వెళ్ళడంతో జానయ్య బోర్లా పడ్డాడు. అప్పుడు వాడి వీపుమీద బాలకృష్ణుడు కాళింది మడుగులో కాళీయుడి వీపు మీద నర్తించినట్లు నా జీవితంలోనే మొదటిసారి భరత నాట్యం చేశాను. రక్తం కక్కుకొని చచ్చిపోయాడు.

***

పెరుమాళ్ళు నేనూ కలిసి వూళ్ళో కూడలిలో చాక్‌పీసుతో రాసిన బోర్డులు ఎవరూ చూడకుండా వేళ్లాడదీసి తోపులోకెళ్ళి పడుకున్నాము. పొద్దునే జనం ఆ బోర్డు మీద అక్షరాలు చదువుతున్నారు.

రాజ్యాంగం నియమించిన అధికారులు
నీతి తప్పితే, పాలకులు పాలితుల క్షేమం
పట్ల ఉపేక్ష, వుదాసీనం పాటిస్తే,
వాళ్ళ మధ్య దూరం ఎక్కువయితే,
పాలితులు రాజ్యాంగేతర శక్తుల దగ్గర కెళుతుంటారు.
పాలకులు ఆ శక్తుల్ని శిక్షించలేకపోతే మానవాతీత శక్తులు
రంగంలోకి దిగుతాయి. ఖబడ్దార్!

ఆ తరువాత నేను పెరుమాళ్ళు ఆనందంగా గాలిలో ఎగురుతూ శ్మశానంలోకి వెళ్ళి చెరో తాటి చెట్టు మాద కూర్చొని బీడీలు త్రాగుతూ పాట మొదలెట్టాం. ❑

# కవిగా బతకడమంటే

**- వర్ఘుల శివకుమార్.**

ఇక్కడే ఈ బావిలో
వలయాలు వలయాలుగా
విస్తరించుకుంటున్నాం
ఓ మెప్పుకోలు
గులకరాయి పలకరింపుకి
రింగు రింగులై
పొంగిపోతున్నాం
కైవారం గోడల మీద
ముఖచిత్రాలు ముద్రించుకుంటున్నాం
బావి బావంతా
సర్వం సహా చక్రవర్తులమై
ఎగిసెగిసి పడుతున్నాం

నేల అంతరాల్లోంచి
బావికి రూపునిచ్చిన
జలధారను మరిచి
నిలవ నీళ్లు చూసుకుని
నీల్గి పడుతున్నాం

ఊట కొత్త అనుభవాల సమాహారం
ఊట నేల గుండె తడి ప్రవాహం
ఊట అక్షరాల జల
బావికి ఊపిరి

అక్షరం అక్షరానికి జతపడనిదే
పదానికి ప్రాణం రాదు
ఆలోచన అనుభవంగా పదునెక్కనిదే
సాకారం కాదు

ఓయ్ కవీ!
ఇది కవితాత్మలకు
కాలం చెల్లిపోతున్న దశ
ఆర్భాటంగా
అకవిత్వాలు వెల్లువెత్తుతున్న దశ

ఓ నాల్గు కొత్త పదాల జగ్లరీ
నాల్గు ప్రతీకల హెచ్చవేతలా
కవిత్వం కాదు

ఓ కన్ను అనంతాకాశంలో
ఓ కన్ను నేల నాదుల్లో నిలిపి
మరో కన్ను నీలోకి నువ్వు సారించు

కవిత్వాన్ని జీవితంగా అనుభూతించు
గాయపడు
గాయాల్ని కవిత్వంతో తుడుచుకో
గాయాల స్పర్శతోనే
కవిత్వం ఔషధ సాధకమౌతుంది

కవిగా బతకడమంటే
కవిత్వంగా బతకడమే
కవిత్వంగా బతకడమంటే
లక్ష్యానికి ప్రాణప్రతిష్ఠ చేయడం